# ఫ్చ్...హూ!

**ఇడ్లీలు** వేడిగా ఉన్నాయి. అయిదో బిళ్లకూడా మింగి అన్నాను.

"చెట్నీ కొంచెం పుల్లగా ఉంది"

"అయిదు తిన్నాకా? ఇప్పటికేనా తెలిసింది... అన్నీ ఇవాళ అయిపోతాయంటారా?"

"ఈ వీధంతకీ సరిపోతాయి. బకాసురుడి తాలూకనుకున్నావా?"

ఒక్క క్షణం ఆగిపోయాను. ఇంక తినాలనిపించలేదు.

"ప్చ్... హూ... బహుశా మధ్యాహ్నానికి అన్నీ అయిపోతాయి"

"రాత్రి కల్లో కూడా ఆయనేనండీ. ఆ ఒక్కటే తినెయ్యండి"

"ఒద్దు. తినాలని లేదు. అసలు ఆయన పోతారనే ఆలోచనే రాలేదు. ఇంకా వెయ్యకు"

"ఎంత అన్యాయం! రేపు సావిత్రిగారొస్తే ఎలా చూడాలో అర్థం కావడం లేదు. కూతుర్లా చూసుకునేది"

"నిజమే. ఏం చెప్పి ఓదార్చగలం"

"ఆ కష్టాన్ని ఎవరూ తీర్చలేరు. కొడుకైనా కూతురైనా నాలుగురోజుల్లో మర్చిపోతారు. ఆవిడికి జీవితాంతం తప్పదు. ఆయనకేం అదృష్టవంతుడు"

"నాన్‌సెన్స్. పోయినవాడు అదృష్టవంతుడెలా అవుతాడు. ఇట్స్ ఆల్ రబ్బిష్. కాఫీ ఇవ్వు"

కృష్ణమూర్తిగారు పోయారని నిన్న సాయంకాలం టెలిగ్రాం వచ్చింది. విశాఖపట్నం నుంచి టెలిగ్రాం అనగానే నాకు భయం వేసింది. "ఫాదర్ ఎక్స్‌పైర్డ్" యాభై నాలుగు సంవత్సరాల జీవితాన్ని రెండు పదాల్లో కుదించాడు శేఖరం, రెండోవాడు. పెద్దవాడు మద్రాసులో ఉంటున్నాడు.

"తీసుకోండి"

"శ్రీధరం వచ్చి ఉంటాడు. చిన్నతనంలో అన్నీ తండ్రికి తనే చెయ్యాలి"

"ప్చ్. ఏవిటో"

"ఊ... ఇలా ఉందేం?"

"ఉదయం సీసా చూస్తే ఖాళీ అయిపోయింది. ప్రస్తుతానికి ఏదో చిన్న పాకెట్ తెప్పించాను. మీరు కాలేజీ నుంచొస్తూ తీసుకురండి. ఒక్క పూటా తాగలేరు"

"ఏదో ఒకటి గొంతులో పోసుకోవడానికి ఇదేమన్నా అదా?"

"సిగ్గేనా లేదు"

"సరే వస్తాను. వచ్చేటప్పుడు ఇంకేవేనా కావాలా?"

"ఒద్దులెండి – మీ ఎత్తు నాకు తెలుసు"

"ఊ. ఓకే, ఆవిణ్ణి తలుచుకుని బాధపడుతూ కూచోకు. ఏం చెయ్యగలం! తలుపేసుకో"

బాబాయిగారి స్నేహితుడు కృష్ణమూర్తిగారు. నేనిక్కడికి బదిలీఅయిరావడం వల్ల ఇద్దరికీ పరిచయం అయింది. నిజానికి ఊళ్లో దిగ్గానే తల దాచుకోవడానికి ముందు ఇంట్లో ఉండమని తరువాత ఇల్లు స్వయంగా వెతికి పెట్టేరాయన. భారీకాయం, కొంచెం నల్లగా, ఎప్పుడూ తెల్లగా నవ్వుతూండేవారాయన. రెండు మూడు పెద్ద గాజు పళ్లేలూ, చిన్నవి రెండు కప్పులూ పగిలినట్టుగా ఉండేది ఆయన నవ్వితే. నవ్వు నాభి ప్రాంతాల్లో అలలుగా బయలుదేరి, ముఖంలోంచి విజృంభించేది. ఎవరేనా ఒక నిముషం ఓపికపట్టి గేటు దగ్గర నిలబడితే ఆయన ఇంట్లో ఉన్నారో లేదో సులభంగా తెలిసి పోతుంది. ("నవ్వకండి బాబూ, ఫొటోలు ఊడిపడుతున్నాయి")

బాబాయిగారు సన్నగా పొడుగ్గా వుంటారు. ఈయన కుంచంలా ఉండేవారు. వాళ్ల స్నేహం నాకూ వ్యాపించింది. కృష్ణమూర్తిగారు వయసులో నాకంటే పెద్దవారైనా మా ఇద్దరి ఆత్మీయతా ఆ భేదాన్ని ఎప్పుడూ గుర్తు చెయ్యలేదు.

"మీరు లావు తగ్గాలి" అనేవాణ్ణి.

"ఎందుకు నాయనా?"

"బ్రదర్. భోంచెయ్యడం కంటే మహాభాగ్యం లేదు. మెలకువగా ఉన్నప్పుడల్లా ఆ పనేచెయ్యడం నాకిష్టం"

"ఊరుకోండి. ఎవరేనా వింటే దిష్టి కూడాను" ఆకులు తుడుస్తూ అనేది సావిత్రిగారు.

"గాడిద గుడ్డు. అదిగాదయ్యా. భోజనం బల్ల దగ్గిర్నించీ లేవబుద్ధి పుట్టదయ్యా"

"అదృష్టవంతులు సార్"

"అల్లుడూ, మాడకు. శుభ్రంగా తిను. అదే నా సందేశం"

కృష్ణమూర్తిగారు నన్ను తాతగారు, నాన్నగారు అని తప్ప అన్ని వరసల్లోనూ

పిలిచేవారు. ఆవిడెప్పుడూ చీవాట్లు పెడుతూండేది. ('రా బ్రదర్ రా. కొంచెం కాఫీ పట్రావే అల్లుడికి") అంతశరీరంతో నాకంటే వేగంగా నడిచి నాకంటే చలాకీగా వుండేవారు. మా ఆవిడకి వంటింట్లో కూచుని పాకశాస్త్ర రహస్యాలు బోధిస్తూండేవారు. ("తల్లీ నా స్లోగనొకటే, లివ్ ఫర్ ది నెక్స్ట్ మీల్")

వరసగా రెండు క్లాసులు చెప్పి మంచినీళ్లు తాగి కూచుండిపోయాను. భూషణం ఎదుటి కుర్చీలో కూచుంటూ అడిగేడు.

"అలా ఉన్నావేంటి?"

"నీరసం. రెండు క్లాసులు, అదీగాక..."

"ఏదీగాక? ఓ సిగరెట్టు కాల్చు ముందు"

"మా కృష్ణమూర్తిగారు నిన్న పోయారు"

"వ్వాట్!! ఆయన పోడవేంటి గురూ. దారుణం"

"ఏం చేస్తాం. ఫ్చ్. ఏడుపొచ్చేసింది"

"అవును. ఎప్పుడూ హాయిగా నవ్వుతూ ఉండేవాడు. ఎన్నేళ్లుంటాయి?"

"ఎంత, యాభై నాలుగో అయిదో"

"ఛీ, ఛీ. ఈ రోజుల్లో అరవై అన్నా చిన్న వయసే. ట్రబులేటీ?"

"అసలొకటీ. ముంచింది మరొకటీ - గుండెపోటు"

"ఎక్కడ పోయారు?"

"విశాఖపట్నం. కూతురిదగ్గర. రేపు జూన్ తరువాత వాలంటరీగా రిటైరయి అక్కడికే వెళ్లిపోదావనుకున్నారు. ఇలా జరిగింది"

"వాలంట్రీగా అంటే. ఎంత సర్వీసుంది"

"వాళ్లకి అరవైగదా"

"సెంట్రలా?"

"అందుకే అరవై"

"అదృష్టవంతులు. అవును, చాలా సర్వీసుంది వాలెంట్రీ ఎలా కుదురుతుంది?"

"ఏం?"

"ఏవేటీ? సర్వీసింకా మూడేళ్లుందనగా వాలెంట్రీ"

"అదేం లేదే. ఆయన..."

"బలేవోడివే. కచ్చితంగా మూడేళ్ల ముందవాలి. ఎప్పుడంటే అప్పుడే అనుకున్నావా?"

"ఏమో మరి"

"గేరంటీ – ఇదో, ఆచార్లూ! మాట"

"ఆ – సిగరెట్లు లేవు బాబూ"

"అబ్బ అదికాదు మాటంటే"

"ఊ, చెప్పు"

"ఇప్పుడూ, సెంట్రల్లో వాలెంట్రీ రిటైర్మెంటు ఎప్పుడూ?"

"నీకెందుకోయి"

"అదిగాదు మాస్టారూ. కృష్ణమూర్తిగారు తెలుసు గదూ. అప్పుడప్పుడూ ఇద్దరం ఒచ్చేవాళ్లం. ఆయన పోయారు. దాని గురించి"

"అరెరే. ఎప్పుడయ్యా? మంచి సరదాగా ఉండేవారు గదూ"

"చాలా. నిన్న వైజాగులో"

"పాపం. వయసు ఎంత ఉంటుంది?"

"ఆయనకి యాభై అయిదేననుకోండి. మనోడు అప్పుడే వాలంట్రీగా రిటైర వ్వొచ్చంటాడు. సెంట్రల్లో మూడేళ్ల ముందుగాని కుదరదు. అంతేగా!"

"అంతే. అందుకేనా పిలిచేవు?"

"అదీ, చూశావా! అయితే ఏటి. ఒక కొడుక్కి ఉద్యోగం ఇస్తారనుకుంటా"

"ఇస్తారు. ఇంతకీ ఎలా పోయారయ్యా? సుస్తీచేసిందా?"

"ప్చ్. లేదుసార్. కూతుర్ని చూడ్డానికి వెళ్లి నాలుగురోజులు జ్వరపడ్డారు. అంతే."

"ప్చ్. చావు ఎలా ఒస్తుందో తల్చుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. మా తోడల్లుడు రామానుజం పోయాడు గుర్తుందా?"

"క్రితం ఏడాది?"

"ఆ, అతగాడూ అంతే. మంచి కాయబారు శరీరం. వక్క పలుకు కూడా వేసుకునే వాడు కాదు. రెండే లంఖణాలుచేశాడయ్యా భూషణం. మూడరోజు ఉదయం హాయిగా కాఫీ తాగి అలా కుర్చీలో వాలాడంతే"

"హంసెగిరిపోయింది. అంతే. అచారీ, మా పెద్దన్న మాత్రం? సుబ్బరంగా ఊళ్లో పొలం వెళ్లి ఇంటకొచ్చి స్నానం గట్రా చేసి నీరసంగా ఉందే అన్నాడంట అంతే. మా ఒదిన ఏంటండీ అనే లోపల ఎళ్లేపోయాడు – క్లాసుగానుందా?"

"ఇంక లేదు. మధ్యాహ్నం"

"లాస్టవరందయ్యా బాబూ, నీకూ?"

"లేదు. ఊ. ఇంకేవిటి ఆచార్లుగారూ?"

"ఏవుందయ్యా, యల్లయిసీ లోను గురించి తిరుగుతున్నాను"

"అవును గురూ, కృష్ణమూర్తిగారు యల్లయిసీ చేశాడా? ఉన్నవాడేనా?"

"ఆ. చేశాడు. ఆ బెంగేం లేదు"

"అదృష్టవంతుడు. లోనేటి ఆచారీ?"

"కొంప గురించి. పునాది వేశాను. మన పని అయిపోయింది. ఇదో, ఎందుకయ్యా నువ్వు అప్పేనా ఇప్పించవు"

"వార్నీ. అసలడిగేవా?"

"అవునూ. ఆయన ఇంట్లో పోయారా, ఆస్పత్రా?"

"ఇంట్లోనే అనుకుంటా"

"సొంతిల్లేనా, అద్దా?"

"అద్దిల్లే"

"అయితే ఇబ్బందే. చావంటే అందరికీ భయవే"

"అందుకే అప్పు ఇయ్యి. ఇల్లు కట్టుకుంటాను"

"ఎంతవరకూ వచ్చింది సార్!"

"చెప్పేగా, పునాది వేశాను. కాల్లుబారజాపేను. ఏం భూషణం? డబ్బు"

"ఇద్దాం లేవయ్యా. నువ్వే నయం. సొంతిల్లేసుకుంటున్నావు"

"రేపు పోతే ఇబ్బంది లేకుండానయ్యా. పాపం ఆయన చూడు"

"అంటే ఇల్లు గలాయన చాలా మంచివాడని చెప్తూండేవారండి"

"ఏదేనా కష్టం ఒచ్చే వరకూ అందరూ మంచే. అవునూ, ఇల్లు కట్టే ప్రయత్నం చేస్తున్నావా?"

"లేదు సార్. స్థలం కొన్నాను. మీరు కానివ్వండి. తరువాత నాకు కట్టిపెట్టండి"

"అద్గదీ. ఎంతలే. ఇంకో నాలు నెలల్లో గృహప్రవేశం. ఏటయ్యా?"

"ముందు గోడలు లేపడానికి డబ్బేది భూషణం? నువ్వా ఏర్పాటుచెయ్యి"

సరే అన్నాగా బెల్లయింది. ఒస్తా గురూ. బెంగపడిపోకు మరీ" ఆచార్లు సిగరెట్టు వెలిగించాడు. జేబులోంచి చిన్న పుస్తకం తీసి లెక్కలు చూస్తూ అన్నాడు.

"అందుకే ఇల్లు కట్టి చూడమన్నారు"

నవ్వేను.

"నీ మనసేం బాగాలేనట్టుంది"

"అవునండీ. ఇంటి లెక్కలా?"

"ఆ నేనే రాళ్లు మోసి కట్టుకుంటే నయం. ఆ కార్యక్రమాలన్నీ అక్కడే చేస్తారా, ఇక్కడా?"

"ఇంకా ఏవీ తెలీదండి"

"పోనీ ఫోన్ చెయ్యకపోయావా? ప్రిన్సిపాల్నడుగు"

"నిజవే. మధ్యాన్నం అడుగుతాను"

"కాల్ బుక్ చెయ్యి. అయినా ఫోన్ చేస్తే ఏడుస్తాడేం బాసు?"

నవ్వేను.

'నిజం కొంతమందికయితే ఏడుపు రాదు. అందరికీ ఒకేలా ఉండాలి. అవునా? నిన్న ఎల్ఐసికి ఫోన్ చేశాను. ఏవీ అన్లేదనుకో మొహం చూస్తూ తెలీదూ? నువ్వడుగు ఏవంటాడో"

"ఏవిటో సార్. ఆమె గురించి ఆలోచిస్తే మాత్రం, భరించలేకుండా ఉన్నాను. చాలా అభిమానంగా ఉండేవారండి"

"అదేనయ్యా ముందు ఫోన్ చెయ్యి. మన అసోసియేషన్లో ఈ ఫోన్ గురించి అడుగుదామనుకుంటున్నానయ్యా. ఏవంటావు?"

"హల్లో" స్టాఫ్ రూం ఓ మూల నుంచి అరిచాడు సాయిమూర్తి.

"ఇలారా" లెక్కలు చూసుకుంటూ జవాబిచ్చాడు ఆచారి.

"అలా అరుస్తారేం?"

"ఏవిటి సార్ సంగతులు"

"ఆ.. మనవాడి క్లోజ్ ఫ్రెండొకాయన పోయారు"

"అరే. సారీ సార్. ఎక్కడ?"

"వైజాగ్‌లో"

"పెద్దాయనా?"

"కాదు. గుండెపోటుట. అవునుగానీ నిన్నసాయంకాలం ఒస్తానని రాలేదేం?"

"సారీ. నేను మా ఆవిడా బజారుకెళ్లాం"

"సిగ్గులే?"

"సర్వీసులో ఉన్నారా సార్, ఆయన?"

"ఆ. ఇంకా అయిదారేళ్లుంది"

"ఇదో, మర్చిపోయాను. సెంట్రల్లో వాలెంటరీ రిటైర్మెంటు రూల్సేవిటి?"

"మూడేళ్ళు ముందుగదూ?"

"నేనూ అదే అన్నాలే. మనవాణ్ణి కూడా త్వరగా ఇల్లు కట్టమని చెప్తున్నా"

"ఇంటికీ, ఉంచుకున్నదానికీ ఎంత పెట్టినా చాలదంటారు"

"మొదటిది నిజం. రెండోది నీకు తెలియాలి"

ముగ్గురం నవ్వేశాం. వాళ్లిద్దరూ వెళ్లిపోయారు. దూరంగా కూచున్న రుక్మిణిగారు ఒచ్చేరు.

"ఎవరూ, పోయారంటున్నారు?"

"మా బంధువులు, కృష్ణమూర్తిగారని"

"అయ్యో. ఎంత వయసు?"

"యాభై దాటేయి. మీ అమ్మాయి కాలెలా ఉంది?"

"బాగానే ఉంది. అందుకే ఒచ్చేశాను. ఊ. జబ్బేవైనా చేసిందా?"

"హార్ట్ ఎటాక్"

"ప్చ్. ఈ రోజుల్లో అందరికీ అదే. మా బావగారొకాయన నిరుడీ రోజుల్లో అలాగే. ఏవిటో. ఈ ఊరేనా?"

"ఆ... లంచ్‌కి వెళ్తున్నారా?"

"లేదు. డబ్బా ఉందిగా. ఊ. ఆవిణ్ని తల్చుకునే మనం బాధపడాలి"

"ప్చ్... ఏవిటోనండీ... ఎన్నిసార్లు పిలిచినా మీ ఆవిడగార్ని తీసుకురారేం? ఈసారయినా వస్తారా?"

"తప్పకుండా. తప్పు నాదేలెండి. ఆవిడిది కాదు"

"ఊ... ఏవిటోనండి. ఈ వార్తలు విన్నప్పుడల్లా మనసంతా చెడిపోతుంది. రాజూ ఇలారా, ప్రిన్సిపాలుగారు ఏం చేస్తున్నారో చూడు. నిద్రపోతుంటే లేపకు పాపం"

"అన్యాయం"

"పది రోజులైందండీ లెటరిచ్చి. ఏం చెయ్యను"

మధ్యాహ్నం క్లాసుల్లేవు. కుర్చీలో ఆలోచిస్తూ ఆలాగే నిద్రపోయాను. భూషణం లేపేడు. ఇద్దరం ఇంటికి బయల్దేరేం.

సాయంకాలం టీ చప్పరిస్తుంటే చటుక్కున గుర్తొచ్చింది.

"ఏవిటీ?"

"కాలేజీ నుంచి వైజాగు ఫోన్ చేద్దావనుకున్నాను. మర్చిపోయాను"

"అరే... మధ్యాహ్నం అంతా మనసేం బాగాలేదండీ"

"అవును. అరెరే, ఎంత పొరపాటయిపోయింది"

"సర్లెండి. మీకు నా పుట్టినరోజే గుర్తుండదు. మర్చిపోయినట్టు నటిస్తారేమో మరి"

"ఛ. అలా ఎక్కువసార్లు చెయ్యలేదుగా. ఇది నిజంగామర్చిపోయాను. వెళ్ళెప్పుడొస్తారో తెలీదు. ఆ మర్చిపోయాను"

"మళ్లీనా?"

"అదిగాడు. ఆ రుక్మిణిగారు నిన్ను తీసుకురమ్మన్నారు"

"నే ఒద్దన్నట్టు చెప్తారే. అవునూ, మీ బాబాయిగారు ఇక్కడ దిగుతారా?"

"ఏమో, బహుశా టెలిగ్రాం ఇస్తారేమో"

"రాత్రికి రావొచ్చేమో"

"ప్చ్. అటువంటి మనిషిని మళ్లీ చూడం"

"మనవంటే ఎంత ప్రేమండీ ఆయనకి"

"నిజం. ఇదో ఈసారి ఎలాగేనా రుక్మిణిగారింటికి వెళ్లాలి. లేకపోతే బాగోదు"

ఏడు దాటింది క్లబ్‌లో కూచుని పుస్తకాలు తిరగేస్తున్నాను. పక్కనే టేబిలు మీద పూల్ ఆడుతున్నారు. నా వెనక టీవీ. ("కొబ్బరి చెట్టుకు ఈ రకమైన తెగులు కూడా...")

"హలో. ఎంతసేపయింది ఒచ్చి"

రాఘవ పక్కనే ఒచ్చి కూచున్నాడు.

"ఫ్చ్. కృష్ణమూర్తిగారేవిటండీ! ఛ ఛ. మీరు మరీ ఆప్తులాయనకి"

"ఫ్చ్. అన్ని వరసల్తో పిల్చేవారు. నమ్మబుద్ధిగావటం లేదు"

"బాగా చెప్పేరు. అటువంటి మనిషి పోతారని ఎలా అనుకుంటావండీ? పాపం. ఆయన భార్య. నిజంగా...."

"ఫ్చ్"

"కానీ సార్, మీరు ఏవేనా అనండి. మన పద్దతులు మారాలండి. వితంతువును చేసే పద్ధతి ఆటవికం కన్నా అన్యాయం"

"అవును. స్త్రీలే తిరగబడాలి"

"దారుణం అండి బాబూ. ఏదో కావాలని హింస పెడుతున్నట్టు. అసలు బొట్టు ఎందుకు తీసెయ్యాలండీ?"

"నిజవే. ఇదంతా..."

"మారాలండి... రేయి రెండు టీ పత్రా"

"నాకొద్దుసార్"

"ఫరవాలేదు. వేరే సంచిలో పొయ్యండి. ఏదీ సిగరెట్టు ఇవ్వండి ఈ మధ్య తగ్గించాల్లెండి"

"గుడ్. మీ టీ తాగి ఇంటికెళ్లిపోతాను"

"అప్పుడే? అవునూ – మిగతా కార్యక్రమాలన్నీ ఎక్కడ?"

"సరిగా తెలీదండి. ఇంక ఎక్కడైతేనేం లెండి"

"అదీ. అటువంటి మనిషి నిజంగా..."

"ఫ్చ్. వస్తానండి. ఏడున్నర అవుతోంది"

"ఏడున్నరే! అప్పుడే? అరె. కొంచెం జరగండి. న్యూస్ విందాం"

"ఏం?"

"సెంట్రల్ మినిస్ట్రీ మార్పుల్ట. రేయి, టీ ఇక్కడెట్టి వాల్యూమ్ పెంచు"

రాత్రి అన్యమనస్కంగా భోజనం కానిచ్చాను. తిండి విషయంలో కృష్ణమూర్తిగారు సూక్తులు గుర్తొచ్చి మా ఆవిడ కళ్లల్లో నీళ్లు తిరిగేయి.

ఏవీ చదవ బుద్ధి పుట్టలేదు. పేజీలు తిప్పి పుస్తకం అవతల పడేసి మంచం ఎక్కేను.

"నిద్రపోలా?"

"పట్టడం లేదు"

"జరుగు. రేపు బాబాయి ఒస్తాడేమో"

"ఆయన్ని పట్టుకోడం కష్టం"

"అవును. ప్చ్. ఎప్పటి స్నేహం!"

"ఎప్పుడూ నవ్వుతూ ఉండే మనిషీ..."

"జీవితం మీద నమ్మకం పోతోంది"

"ఊ"

"ఆచారిగారు ఇల్లు కదుతున్నారు"

"ఇక్కడెందుకు?"

"సొంత ఇంట్లో పోవడం మంచిదని"

"ఛ"

"అందులో కొంత నిజం ఉంది. నేకూడా అందుకే కదదావనుకుంటున్నాను"

"ఛీ పాడు మాటలు. నోటికి ఏదొస్తే అది అనడవే. ఊ?"

"ల్లే-ల్లేదులే. ఒదులు. ఊపిరాడ్డం లేదు"

"మరి అలా అనకండేం?"

"అనను. ఒకవేళ అంటే"

"అంటేనా...."

"అబ్బ. నీవి పళ్లా, పారలా? బుగ్గ ఊడిపోయింది"

"మంచి పనైంది"

"అలాగా. నీకు మాటల్లో లాభం లేదు"

"ఛా..ఇగరెట్టు కంపు ప్చ్. ఒదలండి ప్లీజ్. కితకితలు... ఊరుకోండి ప్లీ.. అబ్బ. పిన్ను గుచ్చుకుంటుంది. ఛీ. సిగ్గులే..."

"లేదు. నన్ను మాటాడించకు"

జ్యోతి ప్రమోద సంచిక

❖ ❖ ❖